# ఇదేమంత గొప్ప శిక్ష?

(ఆంధ్రప్రభ, 13-8-80)

---

భర్త వదిలేసిన స్త్రీకి సంప్రదాయపు మేలిముసుగులో వున్న మన సమాజం ఇచ్చే రక్షణకంటే జైలుగోడల రక్షణే మేలా?

కోర్టు విధించే శిక్షకంటే సమాజం విధించే శిక్ష పెద్దదా?

—జయప్రద

---

ఆరోజు మంగళవారం. పదిగంటలు పూర్తికావటానికి పది నిమిషాలు టైము వుండగానే నేను చూడవలసిన పేషెంట్స్‌ని చూడటం పూర్తయింది.

ఈరోజు బహుశా మంగళవారానికి ఏ అమావాస్యో కలసి వుంటుంది.

అందుకే చాలా పల్చగా వున్నారు పేషెంట్స్.

ఆ విశ్రాంతి మధ్యగా చటుక్కున ఏదో ఊహ. దానిని కాగితం మీద పెట్టకపోతే వూపిరాడదు.

తలవంచుకుని గవర్నమెంట్ వారి ఓ.పి కాగితాన్ని నా వూహల సరాలతో ఖరాబు చేస్తున్నాను.

నా ముందు నీడ. నేను తల ఎత్తలేదు. తల ఎత్తితే నా మూడ్ చెదిరిపోతుంది.

మరో ఐదునిమిషాలు గవర్నమెంట్ వాళ్ళ టైమ్‌ని కూడా నా కొరకు ఖర్చుపెట్టుకోదలుచుకున్నాను"

"డాక్టర్‌గారూ!"

తల ఎత్తక తప్పలేదు.

అసలే గవర్నమెంట్ డాక్టర్‌లంటే అన్యాయమైన దురభిప్రాయం వుంది జనాల్లో.

"కూర్చో"

ఆమె కూర్చోలేదు.

నేను బ్రౌన్ పేపర్ మీద మరో లైన్ గెలికేసాను. టైమ్ వృథా కానీయకుండా—

"డాక్టరమ్మా" ఈసారి ఆ స్వరం చాలా హీనంగా వుంది.

ఆ స్వరంలోని హీనత్వం నన్ను లేపి నాలోని రచయిత్రిని ప్రక్కకి నెట్టింది.

తలఎత్తి కూర్చోమన్నట్టు చూసాను. ఆమె కళ్ళు చాలా నీరసంగా ఉన్నాయి.

ఆమె పెదాలు తడి ఆరిపోతున్నాయి.

ఆమె కూర్చోలేదు.

ఒక్క అడుగు ముందుకేసి నా బల్లనానుకొని నిలుచుని దీనంగా చూస్తూ అంది.

"మీరు నాకో పాపనివ్వాలి డాక్టరమ్మా""

"మొదట నువ్వు కూర్చో" నేను చిన్నగా నవ్వి వ్రాస్తున్న కాగితాలు మడిచి క్రింద పెట్టాను.

ఆమె కూర్చుంది.

"మీ ఆయన వచ్చారా?" కాజువల్‌గా అడిగాను.

ఇలా చాలామంది స్త్రీలు వచ్చి తమ కడుపు పండించమని కాస్త సిగ్గుగా, కాస్త సంకోచంగా, కాస్త దిగులుగా అడగడం నాకలవాటే.

"ఆయనతో పనిలేదమ్మా! నాకు ఒక పాప కావాలి మీరు ఇవ్వగలరా?" ఆ కళ్ళలో చిక్కబడుతున్న ధైర్యం.

నాకర్ధం కాలేదు. నాకర్ధంకాని సంగతి ఆమెకు బోధపడినట్టు వుంది.

ఆర్టిఫీషియల్ ఇన్‌సెమినేషన్ కొరకు వచ్చింది కాబోలు అని నేననుకుంటుండగానే....

"నేను తల్లిని కాలేనని డాక్టర్లు నిర్ణయించారు" అంది.

"కాని నేను తల్లిని కావాలమ్మా! నా కాపురం నిలబెట్టుకోవటానికి నేను తల్లిని కావాలి" అంది గబగబ.

నేను జాలిగా ఓ క్షణంచూసి ఆ పిల్లలో కొత్త ఆశలు రేపే ఉద్దేశ్యంతో అన్నాను.

"నన్ను పరీక్ష చేయనీ, పుట్టరని అనిపిస్తే ఆ తర్వాత ఎవరి నయినా పెంచుకుందువుగాని"

ఆమె తల అడ్డంగా వూపింది. ఆమె కాస్త చదువుకున్న పిల్లలాగే వుంది.

"లేదు డాక్టర్! ఆ ఆశలూ, డాక్టర్‌ల ఆశలూ అన్నీ ఆరిపోయాయి. ఆఖరికి ఒక డాక్టరమ్మ నాకు సంతాన యోగం లేదని నా భర్తతోనే చెప్పేసింది.

ఆ తర్వాత ఆమె క్షణం తటపటాయించింది.

"నేను తల్లిని కాలేను. కాని తల్లిగా నటించదలచుకున్నానండి"

"నటించడమా?"

ఎవరయినా బిడ్డల్ని పెంచుకోవడం సహజమే కాని ఆ తర్వాత కథ ఆమె చెపుతుందని కాసేపు ఎదురు చూసాను. ఆమె ఆ విషయం ఏమీ చెప్పలేదు.

మరల నన్ను ప్రాధేయపడసాగింది.

"మీ దగ్గర పెళ్ళికాని తల్లుల పిల్లల్ని వదిలేసి వెళుతూ ఉంటారట! అలాటి పాపల్ని ఒకర్ని నాకివ్వరా?"

నాకు చాలా కుతూహలంగా వుంది.

ఆ పిల్ల వాడిన 'నటించడం' అనే పదం వెనక కథ తెలుసుకోవాలని. కాని, మరల చిట్స్ ఇష్యూ చేసినట్టున్నారు.

ఒ.పి.లో క్యూ తయారయింది.

"సరే అలాగే! నీ అడ్రస్ ఇచ్చి వెళ్ళు-అలాటి వారెవరయినా వుంటే తెలుపుతాను" అని మరల నా పనిలో మునిగి పోబోయాను.

"కాని....కాని డాక్టరమ్మా....నాకు...."

ఆపిల్ల సంకోచంగా నిలుచుంది.

ఆమె పెదాలు అదురుతున్నాయి.

నా టేబుల్ మీద అన్చిన ఆ వేళ్ళ కొనలు వణుకుతున్నాయి.

ఒక బిడ్డని పెంచుకోవటానికి మాత్రమే ఆ పిల్ల నా ఎదురుగా నిలబడితే, ఆ అధరాలు అధరవలసిన అవసరం లేదు.

నాలో కుతూహలం మరీ ఎక్కువయింది. నాలో రచయిత్రి మరల రంగంలోకి వచ్చింది.

"కూర్చో ...నిదానంగా చెప్పు" అన్నాను అనునయంగా.

"సరిగ్గా తొంభయ్ రోజుల తర్వాత నాకు అప్పుడే పుట్టిన బిడ్డ కావాలి" ఉపోద్ఘాతం లేకుండా చెప్పి ముగించిందామె.

నేను మరల కన్ఫ్యూషన్‌లో పడిపోయాను.

నేను ఈసారి ఆ పిల్ల దగ్గర్నుండి పూర్తి కథ వినటానికే నిశ్చయించుకున్నాను."

"నీ పేరేమిటి?" అడిగాను-ఇంతవరకు నా ఎదురుగా నిలుచుని నాకు ఫజిల్‌గా మిగిలిపోయిన గడ్డంమీద పెద్ద పుట్టుమచ్చ వున్న ఆ పిల్లను.

"అనంతలక్ష్మి"

"చూడమ్మా! నీతో నేను కాస్త సావకాశంగా మాట్లాడాలి. కాసేపు అలా కూర్చుంటావా?" వీళ్ళని పంపేసి...."

నేను మాట పూర్తి చేయకముందే అలాగే అన్నట్టు గబగబ తల వూపి పక్కకు తప్పుకుందామె.

నా ముందర అనంతలక్ష్మి వెనుక తయారయిన క్యూలో మొదట నిలబడి సంభాషణ వింటున్న ఆమె ఆరోనెల గర్భవతి. కాళ్ళు వాపులతో,

రక్తం లేమితో ఆయాస పడుతుంది. బెల్ నొక్కి ఆయాను పిలిచి ఆమెను లోపలికి పంపమన్నాను.

★ ★ ★ ★

నేను సెషన్సు కోర్టులో అడుగు పెట్టేసరికి హాలు నిశ్శబ్దంగా ఉంది. విట్‌నెస్ బాక్సులో నా పేషెంట్ ప్రభావతి, ఈ సాక్ష్యాలు అవి గవర్నమెంట్ డాక్టరుగా నాకు అప్పుడప్పుడు తప్పడం లేదు.

ఒక రోజు మా హాస్పిటల్ చరిత్రలోనే అద్భుతం జరిగింది. కాన్పయిన నలుగురు బిడ్డల్లో ఒకరు మాయమైన రాత్రి అది. ఆ బిడ్డ తాలూకూ దయనీయమైన తల్లి ఈ ప్రభావతి. పాలుగారే బుగ్గలతో కేరింతలాడే కనుపాపలతో ముట్టుకుంటే కంది పోయేలా, వున్న అందాల శిశువును కన్నతల్లి ఆమె. పదేళ్ళ తర్వాత గర్భం ధరించే గుర్రపు వాతంతో హాస్పిటల్‌కు వచ్చి, కాన్పు టైమ్‌లో ఫిట్సులోకి వెళ్ళి మృత్యువుతో పోరాడి బ్రతికిన ఆమెను దుఃఖంలోను దిగ్భ్రాంతిలోనూ ముంచి మాయమైంది ఆ శిశువు.

ఈమె మీకు తెలుసా? పబ్లిక్ ప్రాసిక్యూటర్. ప్రభావతిని ప్రశ్నిస్తున్నారు.

డాక్‌లోని వ్యక్తిని చూసి నేను ఉలిక్కి పడ్డాను. ఆ వ్యక్తి ముద్దాయి ఆమె గడ్డం ప్రక్క పులిపిరిలా పెద్ద పుట్టుమచ్చ ఆమె అనంతలక్ష్మి నా ఆలోచనలు వేగంగా వెనక్కు మళ్ళాయి.

★ ★ ★ ★

"ఇప్పుడు చెప్పు, అనంతలక్ష్మి! నీ కథ పూర్తిగా చెప్పు. అందరిని పంపేసి నిదానంగా అడిగాను ఆ రోజు ఓ.పి.లో.

ఆమె మరో రెండు నిమిషాలు ఏమీ చెప్పలేకపోయింది. ఆమె కళ్ళనిండా నీళ్ళు అవి చెంపల మీద జారి పోతుండగా అంది!

"డాక్టర్ గారూ! నాకు పిల్లలు లేరని మా వారు మరల పెళ్ళి చేసుకోవాలను కుంటున్నారు."

నేను మాట్లాడలేదు. మామూలు కథే ఈ సమాజం ఆడదాని తప్పుకు ఎంతగా శిక్ష విధిస్తుందో- మగవాడి తప్పును అంతగా క్షమి స్తుంది.

ఆమె తల వంచుకుని చెపుతూంది.

"పెంచుకుందామని చెప్పినా- అతను వినడం లేదు. అందుకని నా కిప్పుడే ఆరో నెలని చెప్పాను. ఏడో నెలలో నా పుట్టింటికి వెళ్ళి పోతాను. ఆ తరువాత మీరు పాపనిస్తే కాన్పయిందని చెప్పి...." ఆగి పోయింది.

నా కంతా అర్ధమయింది.

"మీ వారికి అనుమానం కలగలేదా....?" ఆ పిల్ల కన్నీళ్ళలో సంతోషం.

"లేదండీ, నేను గర్భవతినని తెలిసాక నన్ను బాగా చూస్తున్నారు. నాకు డాక్టర్లు రెస్ట్ కావాలన్నారని చెప్పాను.

అతను ఆమె నిప్పుడు అపురూపంగానే చూస్తున్నాడట.

తన గర్భంలో ఉండే శిశువు కొరకు తనను బాగా చూస్తున్నం దుకు ఆ పిల్లకు ఆనందంగానే వుంటుంది. ఈ రకంగా జీవితంలో అడు గడుగునా రాజీ పడకపోతే నిజంగా ఆడది బ్రతకలేదు.

"తరువాత తెలిస్తే...."

"తెలియదు" ఆమె నమ్మకంగా చెప్పింది. నేను ఆలోచించాను. ఆ పిల్ల కాపురం నిలబెట్టడానికి నేను ఆ నాటకంలో పాత్రను కావడానికి నిర్ణయించుకున్నాను.

"అలాగే మరల కనిపించు" అని లేచాను.

ఆ మూడు నెలలూ నా చుట్టూ తిరిగి అలసిపోయింది అనంత లక్ష్మి.

అప్పుడప్పుడు ఇల్లీగల్ ప్రెగ్నెన్సీస్‌తో వచ్చి కని వదిలేసిపోయే తల్లులు, సంతానం ఎక్కువ అయిపోయిందని వేళ మించాక అబార్షన్ కొరకు వచ్చి మా సలహా మీద కని ఎవరికయినా పిల్లల్ని ఇచ్చేవాళ్ళు. మాకు సాధారణంగానే తారసపడేవారు. అదేమి చిత్రమో వెతికినా ఆ మూడు నెలలు అలాంటి వాళ్ళు ఒక్కరూ తారస పడలేదు. అలా నా మీద నమ్మకంతో మరెక్కడా ప్రయత్నం చేయని అనంత లక్ష్మి నా అసహాయతకు కృంగిపోయి మరే గత్యంతరమూ లేక ఈ పని చేసిందన్న మాట.

నేను గతం నుండి తేరుకునే సరికి ప్రభావతితో పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీఫ్ ఎగ్జామినేషన్ పూర్తి అయింది. పి డబ్లుని పిలవడమైంది. ఆమె రంగమ్మ. ప్రభావతి మేనత్త. ప్రభావతి కాన్పయినప్పుడు ప్రభావతి దగ్గరున్న అటెండెంట్.

"ఈమె మీకు తెలుసా? ప్రమాణం స్వీకరించిన తరువాత అడిగారు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"తెలియక పోవడమేమిటండి? దొంగముండ! తొమ్మిదో నెల అని చెప్పి మా చుట్టూ తిరుగుతూ వుండేది. కాఫీ ఇచ్చి మర్యాదలు కూడా చేసేదాన్ని. రంగమ్మ అక్కసు, అసహ్యం అంతా ఆమె గొంతులో బద్దలయ్యాయి.

అనంతలక్ష్మి వైపు చూశాను.

తలవంచుకుని నిలుచునుందా పిల్ల. ఆ పిల్ల చేసిన తప్పు గురించి ఆ హాలులో అందరికీ తెలుసు. ఆ హాలులో వున్న మగ, ఆడ అంతా ఆమె చేసిన పనికి ఆమెను అసహ్యించుకుంటున్న వాళ్ళే. కానీ, ఆమె తప్పు చేయడానికి కారణం తెలిసిన దాన్ని నేనొక్కదాన్నే.

ఆ పిల్ల ఆ తప్పు చేయడానికి కారణం ఏమిటి?

ఆ కారకులకు శిక్ష ఏది? ఆలోచిస్తున్న నేను మనసులో తుళ్ళి పడ్డాను.

ప్రాసిక్యూషన్ విట్‌నెస్ నంబర్ 3 గా నేను ఆ విట్‌నెస్ బాక్స్‌లోకి వెళ్ళాలి. వెళ్ళి ఏం సాక్ష్యం చెప్పాలి?

ఈ అమ్మాయే ఓ పిలో నా దగ్గరికి వచ్చి బిడ్డ కావాలి అని అడిగిందని సాక్ష్యం చెప్పి ఆ పిల్లను కట కటాల వెనక్కు పంపి ఇంకా శాపగ్రస్త చేయాలా!

నేను ఆలోచిస్తూండగానే అయిదు గంటలు కొట్టడం- అప్పటికే అలసిపోయి వున్న జడ్జి కేస్ మరునాటికి వాయిదా వేయడం జరిగిపోయింది.

ఎప్పుడెప్పుడు సాక్ష్యం చెప్పేసి బయట పడదామా అని ఆ హాలులో ప్రవేశించిన నేను ఇంటికి వెళ్ళాలనే ధ్యాస లేనట్టు అక్కడే ఆ కోర్టు వరండాలోనే నిలుచుండిపోయాను.

అలా నిలుచున్న నాకు దూరంగా కాంపౌండ్‌లో అనంతలక్ష్మి నడిచిపోవడం కనిపించింది.

చప్పున కదలి త్వర త్వరగా నడిచి ఆమెను "క్వార్టర్స్‌కురా" అనేసి మరెవ్వరికి అనుమానం కలగ కుండా నడకను కంటిన్యూ చేశాను.

కోర్టు బయట బిడ్డను పోగొట్టుకున్న తల్లి కనిపించింది. పరీక్షగా నిదానంగా ఆమె వైపు చూశాను. నా మెదడులో ఒక జ్ఞాపకపు తెర కదిలినట్టయింది.

ఈమె ఆ రోజు అనంతలక్ష్మితో నేను మాట్లాడే టప్పుడు క్యూలో మొదట ఆయాసంగా నిలుచున్న గర్భవతి.

నాకు అలాగే అనంతలక్ష్మి రూపం ఆమె కథ. అమెలో ముద్ర వేసుకున్నట్టున్నాయి.

అందుకే పోలీసులు కనిపెట్టి తెచ్చి అనంతలక్ష్మిని తొందరగానే గుర్తు పట్ట గలిగిందామె. ఆ మాయమైన బిడ్డ తొడమీద పెద్ద పులిపిరి. ఆ బిడ్డ గుర్తింపుకు కారణమైంది.

నడక వేగం పెంచి ప్రభావతిని కలుసుకుని ఆమెను పాపను ఆమెతో రెండు నిమిషాలు మాట్లాడి ఆమె అంగీకారంగా తల ఆడించక ఆమెను వదలి రిక్షా ఎక్కాను.

* * * *

"ఇలా ఎందుకు చేశావు అనంతలక్ష్మి?" అమెను కూర్చోమని నేను కూర్చుంటూ అన్నాను.

"అంతకంటే మరో గత్యంతరం లేకపోయింది డాక్టర్‌గారూ!" తలవంచుకుని అంది.

"చూడు ఇప్పుడు నీకెంత శిక్ష పడుతుందో?

ఒక బిడ్డను దొంగిలించడం చాలా ఘోరమైన నేరం."

ఆమె తల ఎత్తింది అమె కళ్ళు జ్వలిస్తున్నాయి. నిజమే. నే నొప్పుకుంటాను. ఇది ఘోరమైన నేరమే. నాకీ శిక్ష సమంజసమైందే. పోనివ్వండి. డాక్టర్‌గారూ! నాకు వీళ్ళు విధించదలచుకున్న శిక్ష కంటే ఇదేమంత పెద్దదేమీ కాదు."

"శిక్షా! ఏమిటా శిక్ష?"

ఆమె మరల తల కొద్దిగా వంచుకుంది. తనకు యివ్వవలసిన జవాబుకు జుగుప్సగా ఫీలవుతోందో, సిగ్గుపడుతోందో.

"మావారు రెండో పెళ్ళి చేసుకున్నాక నేను అతనిని వదిలి

పోవాలట. లేకపోతే ఇద్దరు భార్యల మధ్య అతను నలిగిపోవలసి వస్తుందట. అలా నేను మంచి మనసు చేసుకుని వెళ్ళిపోతే, నాకు నెలకు పాతిక రూపాయలిస్తారట. అది నావాడు, నన్ను రక్షించవలసినవాడు నాకు విధిస్తున్న శిక్ష.

ఇప్పుడు చెప్పండి, ఏ శిక్ష గొప్పది అనిపిస్తుంది మీకు?"

ఆ పిల్లగొంతులో అసహ్యపు తెరలు.

"నువ్వెలా వూరుకున్నావు? కోర్టులు వున్నాయి. న్యాయం నీవైపు వుంటుంది" కోపంగా అన్నాను.

ఇదివరకు పిల్లలకొరకు రెండవ పెళ్ళి చేసుకున్నవాళ్ళను చాలా మందిని చూశాను.

కానీ, ఇలా మొదటి భార్యను నిర్దాక్షిణ్యంగా మంచి మనసు చేసుకుని బయటకి వెళ్ళమనే పురుష పుంగవులను చూడడం నాకిదే మొదలు.

"డాక్టర్‌గారూ! కోర్టు తీర్పుమీద ఎంతకాలం కాపురాలు నిలబడతాయండి?

అయినా రెండో పెళ్ళి చేసుకునే వాళ్ళు ఎంతోమంది వుంటారు. కాకపోతే నా దురదృష్టంకొద్దీ ఆతనికి బయటికి వెళ్ళగొట్టే వూహల్లేకుండా ఉండి వుంటే ఈ పని చేయకపోదును. పోనీలెండి. ఆ జైల్లో నాకింత రక్షణ అన్నా వుంటుంది."

నేను నిర్వీర్యురాలనయిపోయాను."

అంటే....అంటే....భర్త వదిలేసిన స్త్రీకి ఈ సమాజం ఇచ్చే స్థానం జైలు 'శిక్షకంటే అన్యాయమైందా? అంటే భర్త వదిలేశాక స్త్రీకి మరో జీవితమే లేదా?

ఆ తరువాత జీవితాన్ని మరో దారిలో అందంగా మలుచుకోవడానికి ఆమెకు మార్గమే లేదా?

ఆమెకు ఈ జీవితం తాలూకూ తలుపులన్నీ తిరస్కృతితో మూసుకుపోతాయి?

ఆడదానికి ఈ సమాజంలో భర్త తోడి సాహచర్యం తప్ప ఆమె కంటూ మరో ప్రపంచమే వుండదా? వున్నా అది జైలులాంటి జీవితమా? ఇంత ఇరుకైనదా మనం గొప్పగా చెప్పకునే మన సమాజం.

నా ఆలోచనలు నన్ను తినేస్తున్నాయి. ఆ ఆలోచనల్ని ఆ పిల్ల మాటల రూపంలో పెట్టింది.

"డాక్టర్‌గారూ! ఆయన మరో పెళ్ళిచేసుకుంటారు. ఆ తరువాత నా స్థానం నాకు తెలుసు. అతని నీడలోంచి నేను బయటపడ్డాక నా జీవితమేమిటో మీరు వూహించలేరా? తల్లితండ్రులు లేనిదాన్ని. భర్త, అత్త, మామ తప్ప మరో ప్రపంచం తెలియనిదాన్ని. భర్తచేత నిరసించబడ్డదాన్ని. పొట్టగడుపుకోవడానికి శూన్యమైపోయిన కాలాన్ని చంపడానికి గౌరవంగా బ్రతకడానికి కనీసపు చదువు లేనిదాన్ని.

ఏమీ లేకపోయినా అందమూ, వయసూ వున్నదాన్ని.

అడుగడుగునా స్త్రీ శీలానికయితే కొండంత విలువని ఆపాదించిన ఈ పవిత్రమైన భారతదేశంలో ఆ శీలాన్ని కాపాడుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ, అవమానాల్ని భరిస్తూ బతికేకంటే చెప్పండీ ఆ జైలు నయంకదూ?

అసలు ఎవరికొరకు బతకాలి. డాక్టర్‌గారూ! ఏ ఆశతో బతకాలి?

లేని బిడ్డచేత, వున్న భర్త చేతకూడా ప్రేమించబడకుండా అసలెందుకు బతకాలి. డాక్టర్‌గారూ?

నన్ను ఆయన పెళ్ళిజేసుకొనేరోజు బిడ్డల కొరకే నిన్ను చేసుకుంటున్నానని ఎందుకు చెప్పలేదు? నీకు జీవితాంతం నీడగా నిలుస్తానని అబద్ధం ఎందుకు చెప్పాలి డాక్టర్‌గారూ!" ఆ పిల్ల గొంతులో కన్నీళ్ళు గరగరలాడాయి.

నాకు ఆ పిల్లతో మాట్లాడడానికేమీ మిగలలేదు. అసలు నా ఉద్దేశ్యం ఆ పిల్ల నొప్పించి కోర్టులో ఆ పిల్ల నాకులెలియదు అని అబద్ధమాడి, బిడ్డను పోగొట్టుకొన్న ఆ తల్లితో మరల మాట్లాడి ఆమె బిడ్డను ఆమెకి ఇప్పించేసి ఆ కేసు ఉపసంహరించుకునేలా చేయాలని ఇలాంటి కోర్టును ధిక్కరించే వూహ క్షణాల్లో నాకెందుకొచ్చిందంటే నేను అనంతలక్ష్మి స్థానంలో ఈ ప్రస్తుత సమాజపు క్రూరమైన హస్తాలలో నిలిచి ఆలోచించాను.

నేనయినా అలాంటి పరిస్థితులలో అలాగేచేసి వుందునేమోననిపించింది.

అలాంటి నిర్ణయం తీసుకునేలా చేసి ఈ సమాజపు రీతులు ఎంత క్రూరమైనవి!

కేవలం భర్తతోడి జీవితం తప్ప మరో జీవితం లేదని భావించి అతని బిడ్డకు తల్లి అయి, అతని ప్రేమను కోరుకోవాలని వూహించిన అనంతలక్ష్మి బతుకుతున్న సమాజం ఎంత అసహ్యమైంది.

కాని, నాకు వీళ్ళు విధించదలచుకున్న శిక్షకంటే ఇదేమంత పెద్ద శిక్ష కాదన్న ఆ పిల్లమాటలు నా నిర్ణయాన్ని నాలోనే దాచేసాయి.

"నాకు వీళ్ళు విధించదలచుకున్న శిక్ష కంటే ఇదేమంత పెద్ద శిక్ష?" అంటున్న ఆ పిల్లను నేనేం ఉద్ధరించేది?

నాకు వీళ్ళు విధించదల్చుకున్న శిక్ష....

వీళ్ళు....వీళ్ళు....వీళ్ళు ఎవరు వాళ్ళు?

ఆమె భర్తా? ఆమె తాలూకూ వాళ్ళా?

కాదు, ఎవ్వరూ కాదు స్త్రీకి భర్త తప్ప మరోదారి చూపని ఈ సమాజం, భర్తలేని స్త్రీని గౌరవంగా చూడలేని సమాజం.... ఆమె కింత రక్షణ ఇవ్వలేని సమాజం....

ఈ సమాజంలోని నేను లేని నిల్చున్నాను.

రేపు కోర్టులో ఏం చెప్పాలి? ఏం చెప్పాలి? ఏం చెప్పాలి?

❋